సాక్షి
ఒడిశా
గురువారం । 24 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,85,866లు,బంగారం 5 గ్రాముల 200 మిల్లీగ్రాములు, వెండి 36గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



విశిష్ట వ్యక్తులకు గవర్నర్ సత్కారం

రాష్ట్ర సాహిత్యం, కళలు, క్రీడలు తదితర రంగాల్లో విశిష్ట గుర్తింపు పొందిన పలువురు ప్రముఖులకు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ప్రత్యేకంగా సత్కరించారు.

- 8లో.



ఆరోగ్య కేంద్రం జలమయం

మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జోడాంబు పంచాయతీలో ఉన్న ఆరోగ్య కేంద్రం ఇటీవల కురిసిన వర్షానికి జలమయమైంది.

- 8లో.

అమానుషం!



దాడికి గురైన బాధితురాలిని ఇంటి నుంచి ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్లో) నిందితుడు సత్యజిత్ సర్కార్



ఆస్పత్రి వద్ద పోలీసుల రక్షణ

- ప్రేమను తిరస్కరించిందని యువతిపై నడిరోడ్డుపై దాడికి పాల్పడిన యువకుడు
- పోలీసులను ఆశ్రయించిన కుటుంబ సభ్యులు
- కక్షతో యువతి ఫొటోలను మార్ఫింగ్ చేసి వైరల్ చేసిన నిందితుడు
- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

కొరాపుట్ :

రాష్ట్రంలో మరో యువతిపై అమానసీయ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితికి చెందిన కల్పనారాయ్ అనే యువతి జయపూర్ పట్టణంలో నర్సింగ్ విద్య చదువుతోంది. ఆమె స్వగ్రామానికి చెందిన సత్యజిత్ సర్కార్ జయపూర్ వచ్చి ప్రేమ పేరుతో యువతిని వేధించేవాడు. ఆమె తిరస్కరించడంతో ఈ నెల 13న జయపూర్‌లో నడిరోడ్డుపై పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న బాధితురాలి కుటుంబ సభ్యులు జయపూర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 15న పిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి సత్యజిత్ సర్కార్‌ని అదుపులోకి కోర్టులో హాజరుపరిచారు. బెయిల్‌బుల్ సెక్షన్లు ఉండటంతో కోర్టు వెంటనే బెయిల్ మంజూరు చేసింది. గాయపడిన బాధిత యువతి రాయిఘర్‌లోని ఇంటికి వచ్చేసింది. ఇదే సమయంలో సత్యజిత్ కూడా స్వగ్రామానికి వచ్చాడు. తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందనే కోపంతో ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. దీంతో బాధిత యువతి మనస్తాపానికి గురై ఎరువుల మందులు తిని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబీకులు యువతిని రాయిఘర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సమీపంలోని కాంకేర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో ఛత్తీస్‌గఢ్ రాజధానిలోని ప్రధాన ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు పరిశీలించి యువతి బతకడం కష్టమని చెప్పడంతో తిరిగి రాయిఘర్ తీసుకొని వచ్చి ఇంటిలో వైద్యం అందజేస్తున్నారు. మంగళవారం బాధిత కుటుంబం రాయిఘర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు..

ఇటీవల మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రభుత్వం సరిగ్గా స్పందించడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో పాలకులు దిద్దుబాటు చర్యలకు దిగారు. ఏఎస్పీ ఆదిత్యసేన్‌ను బాధితురాలి వద్దకు పంపి కేసు దర్యాప్తు ప్రారంభించారు. మెరుగైన వైద్యం కోసం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి ఆమె కిడ్నీ పని చేయడం లేదని ప్రకటించారు. చివరకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు రంగం లోనికి దిగి బాధితురాలిని భువనేశ్వర్ లోని ఎయిమ్స్‌కి తరలించమని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు నిందితుడిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందం రంగంలోనికి దిగింది.

సర్వత్రా ఆగ్రహావేశాలు..

ఈ విషయం మంగళవారం వెలుగులోకి రావడంతో సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. జయపూర్ పోలీసులు నిందితుడిపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని బాధిత కుటుంబం ఆరోపించింది. అందుకే ఫొటోలను వైరల్ చేశాడని వాపోయారు. విషయం తెలుసుకున్న మహిళా హక్కుల ఉద్యమకారిణి, మాఫురో సంస్థ నాయకురాలు కాదంబరి త్రిపాఠి రాయిఘర్ బయలుదేరారు. మరోవైపు అధికారులు రాయిఘర్ చేరుకుని బాధితురాలిని ఉమ్మర్‌కోట్ పట్టణ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మున్నా త్రిపాఠీ, మాజీ ఎమ్మెల్యే భుజబల్ మజ్జిలు బాధిత యువతిని పరామర్శించేందుకు ఆస్పత్రికి వెళ్లారు. అయితే వారిని లోపలికి అనుమతించకపోవడంతో అక్కడే బైఠాయించారు. అనంతరం అనుమతించడంతో బాధితురాలిని పరామర్శించారు.



విచారణ చేపడుతున్న ఏఎస్పీ ఆదిత్య సేన్ తదితరులు



బైఠాయించిన కాంగ్రెస్ నాయకులు

న్యూస్‌రీల్

విధి నిర్వహణలో విద్యుత్ కార్మికుడి మృతి



ఘటనా స్థలంలో రామ బోత్ర మృతదేహం

కొరాపుట్: విధి నిర్వహణలో విద్యుత్ కార్మికుడు మృతి చెందాడు. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం సమితి గొడకుంటా పంచాయతీ ముండాగుడ జంక్షన్ వద్ద విద్యుత్ స్తంభంపై పని చేస్తున్న సమయంలో బొరిగాం గ్రామానికి చెందిన రామ బోత్ర (36) కింద పడిపోయాడు. ఇది చూసిన స్థానికులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. విద్యుత్ షాక్ తగిలి పడిపోయాడని గుర్తించారు. వెంటనే ఈ సమాచారం డాబుగాం పోలీసులకు అందించారు. పోలీసులు వచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితునికి మూడేళ్లు జైలు శిక్ష

జయపురం: బాలికపై అత్యాచారం కేసులో నిందితునికి మూడేళ్ల జైలు శిక్షను జయపురం పోస్కో స్పెషల్ కోర్టు విధించింది. 2017లో జిల్లా పొట్టంగి పోలీసు స్టేషన్ పరిధిలో బాలికపై జరిగిన అత్యాచారంపై కేసును విచారించిన పోస్కో కోర్టు 10 మంది సాక్షులను విచారించింది. 8 రికార్డులను పరిశీలించింది. నిందితుడు బొడాపుట్ గ్రామానికి చెందిన 30 ఏళ్ల దేబొ ఖబరకు మూడేళ్ల శిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చింది. ఈ విషయాన్ని పోస్కో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది డాక్టర్ బి.గాయిత్రీదేవి బుధవారం వెల్లడించారు. 2017 అక్టోబర్ 19వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో బాలిక సమీప నదిలో దుస్తులు ఉతికి తిరిగి వస్తున్న సమయంలో దేబొ ఖబర నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతంలో బాలికపై అత్యాచారానికి పాల్పడుతుండగా హాహాకారాలు చేసింది. ఆమె ఆర్తనాదాలు విని బాలిక సోదరుడు అక్కడకు రావటంతో దేబొ అతడిని చూచి పరుగు తీశాడు. బాలిక జరిగిన విషయం తన కుటుంబ సభ్యులకు వివరించింది. వారు పొట్టంగి పోలీసు స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎస్ఐ గురుదేవ్ కబ్రి, ఏఎస్ఐ అమినేష్ చంద్ర మాలి ఘటనా ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు పంపారని, ఆ కేసుని విచారించి న్యాయాధికారి తీర్పు ఇచ్చారు.

డీజీపీని కలిసిన ట్రైనీ ఐపీఎస్‌లు



ట్రైనీ ఐపీఎస్‌లతో డీజీపీ, అధికారులు

భువనేశ్వర్: రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా, ఇతర సీనియర్ పోలీసు అధికారులను 77వ బ్యాచ్‌కు చెందిన 26 మంది ట్రైనీ ఐపీఎస్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శిక్షణార్థులు వివిధ అంశాలపై వివరంగా చర్చించారు. నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహించి అద్భుతమైన సేవలను అందించాలని డీజీపీ సూచించారు.

కొత్త కలెక్టర్ల నియామకం



మనోజ్ సత్యవాన్ మహాజన్ | డాక్టర్ మహేశ్వర్ స్వయ్ | మధుమిత | అశుతోష్

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలకు నూతన కలెక్టర్లు రానున్నారు. ప్రస్తుత కొరాపుట్ జిల్లా కలెక్టర్ వీ.కీర్తి వాసన్‌ను గంజాం జిల్లాకు బదిలీ చేసింది. 2018 బ్యాచ్‌కి చెందిన సుందర్‌ఘడ్ జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్‌ని కొరాపుట్ జిల్లాకు కలెక్టర్‌గా నియమించారు. ఈయన స్వస్థలం మహారాష్ట్రలోని జలగాం జిల్లా. పేదరికం నుంచి వచ్చిన మనోజ్ పుణే యునివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. తండ్రి ఉపాధ్యాయుడు. నబరంగ్‌పూర్ జిల్లా ప్రస్తుత కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపత్రో సుందర్‌ఘడ్‌కి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో 2014 బ్యాచ్‌కి చెందిన డాక్టర్ మహేశ్వర్ స్వయ్ పంచాయతీరాజ్ డైరెక్టర్ హోదా నుంచి నబరంగపూర్ కలెక్టర్‌గా రానున్నారు.

పర్లాకిమిడి: గజపతి జిల్లా కలెక్టర్ బిజయకుమార్‌దాస్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంసంక్షేమశాఖ అదనపు కార్యదర్శిగా పదోన్నతిపై రాజధానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గంజాం జిల్లా ఛత్రపురం జిల్లా పరిషత్ సి.డి.ఒ., ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధుమితను గజపతి కలెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన మధుమిత గురువారం బాధ్యతలు చేపట్టనున్నట్టు సమాచారం.

రాయగడ: రాయగడ జిల్లా కొత్త కలెక్టర్‌గా సి.అశుతోష్ కులకర్ణి నియమితులయ్యారు. రౌర్‌కెలాలో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన్ను రాయగడ జిల్లా కలెక్టర్‌గా నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు రాయగడ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఫరూల్ పట్వారి ఎస్ఎస్ఈపీడీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. గుణుపూర్ సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కిరణ్ దీప్ కౌర్ సహోట కటక్ మున్సిపాలిటీ కమిషనర్‌గా నియమితులయ్యారు.

ఇద్దరు కార్మికులు మృత్యువాత



మృతి చెందిన బీహార్ కార్మికులు షిరియా సదా, రాకేష్ సదా

కొరాపుట్: విష ప్రయోగం కారణంగా ఇద్దరు బీహార్ కార్మికులు మృతి చెందారు. నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం పోలీస్ స్టేషన్ పరిధిలోని చకల్ పాదర్ గ్రామ పంచాయతీ భారకవతలో బీహార్ రాష్ట్రం సరస జిల్లాకు చెందిన పిరియా సదా (20), రాకేష్ సదా (18) జొరిగాంలో మెగా వాటర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూలి పనికోసం వచ్చారు. మంగళవారం వీరిద్దరూ ఆహారం తిని నిద్రపోయారు. రెండు గంటల తర్వాత ఒక్కసారిగా వాంతులు మొదలయ్యాయి. వెంటనే తోటి కార్మికులు స్పందించి బాధితులను జొరిగాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా మార్గ మధ్యలో రాకేష్ మృతిచెందాడు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో షిరియా సదా మృతి చెందాడు. జొరిగాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిమ్స్‌కు బాధితురాలు తరలింపు



రాయిఘర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధిత కుటుంబం

కొరాపుట్ : రాయ్‌ఘర్ బాధిత యువతిని రాష్ట్ర ప్రభుత్వం చికిత్స నిమిత్తం భువనేశ్వర్‌కు తరలించింది. మరోవైపు బాధిత కుటుంబం ఇచ్చి ఫిర్యాదు మేరకు రాయిఘర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు సత్యజిత్ రాయ్ ఆమెని ప్రేమించమని వేధించేవాడని తెలిసింది. ఆమె మరొకరి ప్రేమతో ఉందని తెలిసి దాడికి పాల్పడినట్లు సమాచారం. దీనికితోడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఫొటోలను వైరల్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు జయపూర్ ఐఐసీ ఉలాస్ చంద్ర రౌత్, నర్సింగ్ హాస్టల్ సూపర్‌వైజర్ చంద్రికా పాత్రోలు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు.

గాయాలతో చూశా..



ఈ నెల 13న యువతి ఔటింగ్‌కి వెళ్లింది. రెండు గంటలైనా తిరిగి రాకపోవడంతో ఫోన్ చేశాను. ఆమె తండ్రి ఫోన్ ఎత్తి బయట ఉన్నామని, తిరిగి వస్తామని చెప్పారు. రాత్రిపూట తండ్రితో కలిసి హాస్టల్‌కు వచ్చేటప్పటికే కంటి, ముక్కుపై తీవ్ర గాయాలు ఉన్నాయి. ఆ రాత్రే తండ్రితో కలిసి ఇంటికి వెళ్లిపోయింది.

– చంద్రికా పాత్రో, నర్సింగ్ హాస్టల్ సూపర్‌వైజర్

అలా అనడం సరికాదు..



ఈ నెల 15న నిందితుడు సత్యజిత్ సర్కార్‌ను కోర్టులో హాజరుపరిచాం. మా వరకు అతనిని అదుపులోకి తీసుకోని కోర్టులో హాజరుపరచడం వరకు చేశాం. తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు. ఈ విషయంలో పోలీసులు చర్యలు తీసుకోలేదనడం సరికాదు.

– ఉల్లాస్ చంద్ర రౌత్, జయపూర్ ఐఐసీ

నేడు శ్రీక్షేత్రంలో చిత్తాలగ్గి సేవ

- మూలవిరాటులకు నుదుట ఆభరణం అలంకరణ
- సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపివేత

భువనేశ్వర్:

శ్రావణ కృష్ణ పక్ష అమావాస్య తిథి పురస్కరించుకుని గురువారం శ్రీ మందిరంలో చిత్తా లగ్గి సేవ నిర్వహిస్తున్నారు. జగన్నాథుని సంస్కృతిలో ఈ తిథి చిత్తా లగ్గి అమావాస్యగా ప్రతీతి. ప్రధానంగా రైతు కుటుంబాలు ప్రత్యేక పబ్బంగా జరుపుకుంటారు. శ్రీ క్షేత్రంలో శ్రీమందిరం రత్న వేదికపై దేవతా త్రయం జగన్నాథుడు, బలభద్రుడు, దేవీ సుభద్ర నుదుట వజ్ర, రత్న, వైడూర్య కచిత ప్రత్యేక ఆభరణాలతో శోభిల్లుతారు. బయట సాధారణ ప్రజలు ప్రత్యేక వంటకాలతో భగవంతునికి నివేదించి ఆరాధిస్తారు. కొన్ని వర్గాలు చిత్తా లగ్గి అమావాస్యని లలాట అమావాస్యగా వ్యవహరిస్తారు. ఈ తిథి పురస్కరించుకుని రత్న వేదికపై మూల విరాటులకు లలాటంపై ప్రత్యేక ఆభరణం బాసికం తొడుగడంతో దీనిని లలాట అమావాస్యగా పేర్కొంటారు. శ్రీ మందిరంలో జగన్నాథుని రోజువారీ ఉదయం పూట ధూపదీపాదుల పూజలు ముగియడంతో లలాట ఆభరణ అలంకరణ ప్రారంభిస్తారు. ఆలయ ఆచారం ప్రకారం పతి మహాపాత్రో సేవాయత్ వర్గం మూల విరాటుల నదుటి ఆభరణం శుద్ధి చేసిన తర్వాత దైతపతి వర్గం ఒక్కో మూల విరాటు నుదుట ఆభరణాన్ని అలంకరిస్తారు. ఇదంతా పూర్తయ్యాక జగతి నాథునికి మహా స్నానం చేయించి సర్వ దర్శనానికి అనుమతిస్తారు. ఈ నేపథ్యంలో సమగ్ర ప్రక్రియ పూర్తయ్యే వరకు శ్రీ మందిరంలో సాధారణ భక్తులకు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేస్తారు. భక్తులకు ఏడాది పొడవునా స్నాన పూర్ణిమ వరకు స్వామి లలాటం వజ్ర కాంతులతో దర్శనం లభిస్తుంది. జ్యేష్ఠ మాసం పూర్ణిమ పురస్కరించుకుని జగతి నాథుని మహా జలాభిషేకం పురస్కరించుకుని నుదుట ధగేలుమనే రత్న ఖచిత బాసిక ఆభరణం తొలగిస్తారు. రథయాత్ర పూర్తయిన తర్వాత ఏటా శ్రావణ కృష్ణ పక్ష అమావాస్య నాడు తిరిగి బాసికం ఆభరణాన్ని స్వామి నుదుట యథాతథంగా అలంకరిస్తారు. జగన్నాథుని లలాటంపై వజ్రం పొదిగిన తెల్లని బాసికం, బలభద్ర స్వామి నుదుట నీలి రంగు రత్నం పొదిగిన బాసికం, దేవీ సుభద్ర నుదుట ఎర్రని మాణిక్యం పొదిగిన బాసికం అలంకరిస్తారు. తదుపరి జ్యేష్ఠ పౌర్ణమి వరకు మూల విరాటుల నుదుట ఈ ఆభరణం నిత్య శోభాయమానంగా తళుక్కుమంటుంది.



జగన్నాథుని వజ్ర ఖచిత చిత్రాభరణం



బలభద్ర స్వామి నీలి రత్న బాసికం



బలభద్ర స్వామి నుదుట చిత్తాభరణం అలంకరణ

రైతుల పండగ..

శ్రావణ మాసం అమావాస్య నాడు రైతాంగం ప్రత్యేక పూజాదులు నిర్వహిస్తారు. సాగు జలాశయాలు, చిత్తడి పంట పొలాల్లో కీటకాల బారి నుంచి రక్షణ పొందే సంకల్పంతో ప్రత్యేక ఆచారాలు వ్యవహరిస్తారు. ఈ తిథి పురస్కరించుకుని ప్రత్యేక పిండి వంటలు చిత్తా, గొంయితా తయారు చేసి చిత్తడి పంట పొలాలు, సాగు జలాశయాల్లో విడిచి పెడతారు. ఈ వంటల్ని కంద ఆకుల్లో చుట్టి భద్రంగా జలాశయాల్లో విడిచి పెడతారు. సాగు భూముల్లో నీటి కింద సంచరించే నత్తలు, జలగలు వంటి కీటకాల బారి నుంచి రక్షణ పొందేందుకు ఈ పిండి వంటలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. సాగు పనుల సమయంలో ఈ కీటకాలు సాధారణంగా రైతుల కాళ్లను స్వల్పంగా గాయపరుస్తుంటాయి. ఈ ముప్పు నుంచి విముక్తి కోసం నత్తలు వంటి కీటకాల తాకిడి నివారణ ఉద్దేశంతో అమావాస్యని ప్రత్యేకంగా జరుపుకోవడంతో దీనిని గెండాకొట్టా ఒసాగా పేర్కొంటారు. బాలాసోర్, మయూర్‌భంజ్, కెంజొహర్ వంటి ప్రాంతాలలో, ఈ పబ్బం గెండాకొట్టా అమావాస్యగా జరుపుకుంటారు. సాగు భూముల్లో నత్తలు వంటి కీటకాల్ని శాంతింపజేయడానికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో గిరిజనులు జరుపుకునే పండుగలలో ఇది ఒకటి కావడం విశేషం.

నేడు సర్వ దర్శనం నిలిపివేత

లలాట అమావాస్య ప్రత్యేక పూజాదులు పురస్కరించుకుని శ్రీ మందిరం రత్న వేదికపై మూల విరాటుల దర్శనం గురువారం తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికార వర్గాలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురు వారం తొలి భోగ మండప సేవ పూర్తయిన తర్వాత మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు సర్వ దర్శనం మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో 56 కొత్త జేఎంఎఫ్‌సీ కోర్టులు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రజలకు త్వరిత న్యాయం అందించాలనే దృక్పథంతో ప్రభుత్వం సరికొత్తగా పలు ప్రాంతాల్లో 56 ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (జేఎంఎఫ్‌సీ) కోర్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. వీటి ద్వారా కొత్తగా 840 ఉద్యోగాలు రానున్నాయి. ఈ పదవులు గెజిటెడ్, నాన్-గెజిటెడ్ హోదాలు కలిగి ఉంటాయి. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం మయూర్‌భంజ్ జిల్లాలో అత్యధికంగా 13 జేఎంఎఫ్‌సీ కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. కెంజొహర్, రాయగడ, బొలంగీర్ జిల్లాల్లో 4 చొప్పున, సుందర్‌గడ్ జిల్లాకు 5 జేఎంఎఫ్‌సీ కోర్టులు కేటాయించారు. ఈ చర్యతో వెనుకబడిన ప్రాంతాలలో త్వరిత న్యాయం పొందే అవకాశం మెరుగుపడుతుంది. కేసుల విచారణ పురస్కరించుకుని కక్షిదారులకు వ్యయ ప్రయాస భారం తగ్గుముఖం పడుతుంది. త్వరిత న్యాయంతో విచారణ సకాలంలో పూర్తయి బాధ్యులైన వారిపై సత్వర చర్యలు చేపట్టేందుకు వీలవుతుంది.

ఘనంగా నెక్కంటి జన్మదిన వేడుకలు



నెక్కంటిని గజమాలతో సత్కరిస్తున్న బ్రాహ్మణ సమాజం సభ్యులు



రక్తదానం చేస్తున్న యువత

రాయగడ: రాజ్యసభ మాజీ ఎంపీ, జిల్లా బీజేడీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు 73వ జన్మదిన వేడుకలు బుధవారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక తేజస్వీ సమీపంలోని బీజేడీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని నెక్కంటి ప్రారంభిస్తూ ప్రసంగించారు. రక్తదానం మహాదానమని పేర్కొన్నారు. స్థానిక జిల్లా కేంద్రాసుపత్రి బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ గౌతం పట్నాయక్, సిబ్బంది పరివేక్షణలో జరిగిన ఈ శిబిరంలో 75 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. నెక్కంటి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్కళాంధ్ర బ్రాహ్మణ సేవా సమాజం సభ్యులు నెక్కంటిని గజమాలతో సత్కరించి ఆశీర్వదించారు. సమాజం అధ్యక్షుడు వేద పండితులు రేజేటి శ్రీనివాస్ శర్మ, కార్యదర్శి భళ్లమూడి నాగరాజు, భాస్కరాచార్యులు గణపతి శాస్త్రి, రేజేటి శ్రీరామ శర్మ, టీఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తహసీల్దార్ వాహనం అడ్డగింత



కొట్‌పాడ్ తహసీల్దార్ వాహనం ముందు మహిళా రైతులు

కొరాపుట్: కొట్‌పాడ్ తహసీల్దార్ ట్వింకిల్ శెఠిని మహిళా రైతులు దిగ్బంధించారు. మంగళవారం విధి నిర్వహణ అనంతరం తిరిగి వస్తుండగా బన్సలి గ్రామ రైల్వే గేటు వద్ద గేటు పడటంతో ఆమె తన వాహనం నిలుపుదల చేశారు. సమీపంలో ఉన్న పొలాల్లో పనిచేస్తున్న మహిళలు వేగంగా వచ్చి వాహనాన్ని దిగ్బంధించారు. ధాన్యం కొనుగోలు సమయంలో నిబంధనల పేరుతో క్వింటాలుకు 15 కేజీలు కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కొట్‌పాడ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో చర్చలు జరిపారు. అనంతరం రైతులు వామనం విడిచి పెట్టారు.

పేపర్ మిల్లు ఎదుట బైఠాయింపు



జయపూర్ పేపర్ మిల్లు ప్రధాన గేటు మూసి వేసిన దృశ్యం

కొరాపుట్: జయపూర్ సమీపంలో గగనాపూర్ వద్ద సేవా పేపర్ మిల్ ప్రధాన గేటును దినసరి కార్మికులు మూసేశారు. బుధవారం మధ్యాహ్నం ముకుమ్మడిగా వెళ్లి గేట్లు మూసి బైఠాయించారు. దీంతో లోపల ఉన్న పేపర్ మిల్లు యాజమాన్య, సిబ్బంది చిక్కుకుపోయారు. గత కొంతకాలంగా తాము చేసిన పనికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఫలితం లేకపోవడంతో ఈ విధమైన ఆందోళనకి దిగారు. ప్రస్తుతం పేపర్ మిల్లులో ఉత్పత్తి నిలిపివేశారు. వందలాది కార్మికులకు వేతనాలు చెల్లించలేదని ఉద్యమాలు జరుగుతున్నాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి బయలుదేరారు.

ఎస్‌డీపీఓ కార్యాలయం ముట్టడి



ఎస్.డి.పి.ఒ కార్యాలయం వద్ద గ్రామస్తులు

జయపురం: సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి ఒటాగాంలో జరిగిన హత్యకు సంబంధించి నిందితులను అరెస్టు చేయాలని, మృతుని కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి పార్థ జగన్నాథ్ కాశ్యప్ కార్యాలయాన్ని బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు ముట్టడించారు. అనంతరం ఎస్‌డీపీఓకు వినతిపత్రం సమర్పించారు.

ఘనంగా బ్యాంక్ ప్రతిష్ట దినోత్సవం



ఆవులకు ఆహారం తినిపిస్తున్న బ్యాంక్ సిబ్బంది

జయపురం: బ్యాంక్ ఆఫ్ బరోడా 118వ ప్రతిష్ఠా దినోత్సవాన్ని జయపురం శాఖలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్ శ్రీరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ నేతృత్వంలో స్థానిక గోపాల గోసేవా వారి ద్వారా నిర్వహించబడుతున్న మహర్షి సందిపాణి గోశాలలోని గోవులకు ఆహారం అందజేశారు.

భారీ స్థాయిలో ఐఏఎస్‌ల బదిలీ

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత భారీస్థాయిలో ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. హేమంత్ శర్మకు సమాచార – ప్రజా సంబంధాల అదనపు ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు కేటాయించారు. సంజీబ్ కుమార్ మిశ్రాను ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా నియమించారు. 17 జిల్లాల్లో కొత్త కలెక్టర్లను నియమించారు. రూపా రోషన్ సాహు రాష్ట్ర గవర్నర్‌కు కమిషనర్ కమ్ సెక్రటరీగా నియమితులయ్యారు. 2014 సంవత్సరపు ఐఏఎస్ బ్యాచ్ అభ్యర్థి చంచల్ రాణాను భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనగా నియమించారు.



విశిష్ట వ్యక్తుల సత్కార సభలో గవర్నర్ దంపతులు



సాహితీవేత్తలకు గవర్నర్ అభివాదం



క్రీడా రత్నాలను సత్కరిస్తున్న గవర్నర్ హరిబాబు

విశిష్ట వ్యక్తులకు గవర్నర్ సత్కారం

భువనేశ్వర్: రాష్ట్ర సాహిత్యం, కళలు, క్రీడలు తదితర రంగాల్లో విశిష్ట గుర్తింపు పొందిన పలువురు ప్రముఖులకు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ప్రత్యేకంగా సత్కరించారు. స్థానిక రాజ్‌భవన్ న్యూ అభిషేక్ హాల్‌లో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ సతీమణి జయశ్రీ కంభంపాటి పాల్గొన్నారు. ఒడిశాకు చెందిన పద్మశ్రీ పురస్కార గ్రహీతలు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు, అంతర్జాతీయ బంగారు పతక విజేతలు, క్రీడాకారులు, 2024 సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఈ సందర్భంగా గవర్నరు సత్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ స్వయంకృషి, శ్రేష్ఠత, క్రమశిక్షణ, సృజనాత్మకత, జాతీయ కీర్తి కిరీటాల సమాహార సమావేశం ఈ కార్యక్రమమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గవర్నర్ కమిషనర్, కార్యదర్శి రూపా రోషన్ సాహు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

వారసత్వ కట్టడాలను పరిరక్షించుకుందాం



ఆలయ ప్రాజెక్టుల సమీక్షలో ముఖ్యమంత్రి

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రముఖ ఆలయాల వారసత్వ విలువల పరిరక్షణలో భాగంగా సాంస్కృతిక పరిరక్షణ, విస్తరణ, సంరక్షణ, యాత్రికుల సౌకర్యాల రూపకల్పన కార్యకలాపాలపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి బుధవారం సమీక్షించారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో ఆయన అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఘుటొగాంవ్, జాజ్‌పూర్, ఏకమ్ర క్షేత్రాల ప్రాజెక్టులపై ప్రధానంగా దృష్టిసారించారు. కెంజొహర్ జిల్లా ఘుటొగాంవ్ తరిణి మాత ఆలయం విస్తరణ రానున్న రెండున్నర ఏళ్ళలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర నిర్మాణ, న్యాయ శాఖ మంత్రి పృథ్వి రాజ్ హరిచందన్, అభివృద్ధి కమిషనర్ అనూ గర్గ్, నిర్మాణ శాఖ కార్యదర్శి సంజయ్ సింగ్, పర్యటన విభాగం సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు రూ.లక్ష వడ్డీలేని రుణం

పర్లాకిమిడి: స్కిల్ ఒడిశా ఆధ్వర్యంలో గజపతి జిల్లాలో నిరుద్యోగ యువతీ, యువకులకు 'సమో యూనికార్న్ అసెస్‌మెంట్ స్కీమ్' కింద రూ.లక్ష రుణాన్ని వడ్డీ లేకుండా ప్రభుత్వం అందజేస్తుంది. దీనికి ఔత్సాహిక నిరుద్యోగ డిప్లమా, పాలిటెక్నిక్ విద్యార్థులు తమ అర్హతలతో బుధవారం కలెక్టరేట్‌కు విచ్చేశారు. వారికి జిల్లా ఉపాధి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సౌభాగ్య స్మృతి రంజన్ త్రిపాఠి ఇంటర్వ్యూలు చేపట్టారు. ఈ స్కీమ్ కింద యువతీ, యువకులకు 18 నుంచి 35 సంవత్సరాలు వయోపరిమితి ఉండాలి.ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు మరో పది సంవత్సరాలు పొడిగింపు ఉంటుంది. నిరుద్యోగ డిప్లొమా, డిగ్రీ విద్యార్థులు తమ గ్రామాల్లో తక్కువ పెట్టుబడితో పిండి మిల్లులు, మొబైల్ రిపేరింగ్, గ్రైండర్స్, మెకానిక్ పనులకు ఈ సొమ్మును వినియోగించుకుంటామని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగ యువతీ, యువకులు గుమ్మా, కాశీనగర్, పర్లాకిమిడి, నువాగడ, మోహానా నుంచి తొలిరోజు 21 మంది ఇంటర్వ్యూలకు విచ్చేసినట్టు జిల్లా ఉపాధి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి స్మృతి రంజన్ త్రిపాఠి తెలియజేశారు. ఈ ఇంటర్వ్యూలు గురువారం కూడా జరుగనున్నట్టు డీడబ్ల్యూఓ రైకా తెలియజేశారు.



కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు



దరఖాస్తుపై సంతకం చేస్తున్న అభ్యర్థి

• ఆరోగ్య కేంద్రం జలమయం

మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జోడాంబు పంచాయతీలో ఉన్న ఆరోగ్య కేంద్రం మంగళవారం కురిసిన వర్షానికి జలమయమైంది. సుమారు నాలుగు అడుగుల మేర నీరు నిలిచిపోవడంతో ఆస్పత్రిలో సామగ్రి, మందులు నీట మునిగాయి. ఈ సమయంలో పది మంది గిరిజనులు చికిత్స కోసం లోపమే ఉన్నారు. దీంతో సిబ్బంది అతికష్టమ్మీద వీరిని బయటకు తరలించారు. మూడు పంచాయతీలకు చెందిన సుమారు ఐదు వేల మంది జనాభాకు ఈ ఆరోగ్య కేంద్రమే ఆధారం. అధికారులు స్పందించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు. – మల్కన్‌గిరి



జోడాంబు ఆరోగ్య కేంద్రం



వార్డుల్లో చేరిన వర్షపు నీరు



ఆరోగ్య కేంద్రంలో చేరిన వర్షం నీరు



నీట మునిగిన సామగ్రి

జనావాసాల్లోకి జింక పిల్ల



హలువ గ్రామంలో కనిపించిన జింక పిల్ల

రాయగడ: సదరు సమితి హలువ గ్రామంలో జింక పిల్ల జనావాసాల్లోకి వచ్చింది. సమీప అడవుల్లో నివసించే వన్యప్రాణులు తాగునీటి కోసం దగ్గరున్న నదీ తీర ప్రాంతాలకు వస్తుంటాయి. జింకపిల్ల మంగళవారం సాయంత్రం హలువ గ్రామంలోకి చొరబడింది. దీనిని చూసిన కొందరు పట్టుకునే ప్రయత్నం చేశారు. అడవుల్లోకి పారిపోయినట్లు గ్రామస్తులు చెప్పారు. ఈ విషయాన్ని రాయగడ అటవీ శాఖ రేంజర్ కామేశ్వర్ ఆచారి దృష్టికి తీసుకువెళ్లగా.. హలువ సమీప గ్రామాలు అటవీ ప్రాంతం కావడంతో వన్యప్రాణులు ఇలా ఒకొక్కసారి తారసపడుతుంటాయన్నారు. ప్రజల నుంచి జింక పిల్లకు ఎటువంటి హాని కలగకుండా సమాచారం తెలిసిన వెంటనే సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించామని చెప్పారు. సమీపంలో జంఝావతి నది ఉండటంతో ఒకొక్కసారి ఇటువంటి తరహా వన్యప్రాణులు నీరు తాగేందుకు వచ్చి గ్రామస్తుల చేతిలో చిక్కుకుంటాయన్నారు. వాటిని మళ్లీ సురక్షితంగా అడవుల్లోకి తరలిస్తుంటారన్నారు.

బాలిక కుటుంబానికి ఓదార్పు



కుటుంబీకుల్ని ఓదార్చుతున్న ఉప ముఖ్యమంత్రి

భువనేశ్వర్: ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న పూరీ జిల్లా నిమాపడా బొలొంగా గ్రామ బాలికని ఉప ముఖ్యమంత్రి ప్రతిభా పరిడా బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాలిక ఆరోగ్య పరిస్థితి, త్వరగా కోలుకునేందుకు కొనసాగిస్తున్న వైద్య, చికిత్స ప్రణాళిక కార్యాచరణ కోసం అనుబంధ వైద్య బృందంతో సంప్రదించారు. బాధిత బాలిక కుటుంబీకుల్ని ఓదార్చారు.

భువనేశ్వర్: ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న పూరీ జిల్లా బొలొంగా బాలికను కలిసి బిజూ జనతా దళ్ ప్రతినిధి బృందం పరామర్శించింది. ఆమె ప్రస్తుత ఆరోగ్యం గురించి ఈ బృందం సభ్యులు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత బాలిక కుటుంబ సభ్యులను కలిసి అందుబాటులో ఉన్న సౌకర్యాలు తదితర ఏర్పాట్లు పరిశీలించారు.

'సుభద్ర శక్తి కేఫ్' ప్రారంభం



సుభద్ర శక్తి కేఫ్‌లో అల్పాహారం తింటున్న అధికారులు



సుభద్ర శక్తి కేఫ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం సుభద్ర శక్తి కేఫ్‌ను జిల్లా కలెక్టర్ బిజయకుమార్ దాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. జిల్లాలో మహిళల వికాసానికి మహిళా స్వశక్తీకరణ కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతుందని జిల్లా కలెక్టర్ దాస్ అన్నారు. గుసాని సమితి మా మంగళా స్వయంసహాయక గ్రూపు మహిళలు సుభద్ర శక్తి కేఫ్ నడిపించడానికి ముందుకు వచ్చారు. ఈ కేఫ్‌లో తక్కువ ధరలకే భోజనం, టిఫిన్ అందుబాటులో ఉంటుందని మహిళా గ్రూపు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో ఆదనపు జిల్లా మాజిస్ట్రేటు ఫల్గుణీ మరిఖి, జిల్లా పరిషత్తు ముఖ్యకార్య నిర్వాహణ అధికారి శంకర్ కెరకెటా, జిల్లా సమగ్ర గిరిజనాభి వృద్ధి శాఖ, ప్రాజెక్టు అధికారి అంశుమాన్ మహాపాత్రో, జిల్లా సామాజిక సంక్షేమశాఖ అధికారి మనోరమా దేవి, ఒడిశా జీవనోపాధుల మిషన్ అధికారి టిమోన్ బోరా, తదితరులు పాల్గొన్నారు.

తరుణ ప్రజ్ఞా భారతి ఉత్సవాలపై సమీక్ష



సమావేశంలో ప్రజ్ఞాభారతి సభ్యులు

జయపురం: ప్రాచీన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను పరిరక్షణకు 36 ఏళ్లుగా ఉద్యమిస్తున్న జయపురం తరుణ ప్రజ్ఞా భారతి సంస్థ 37వ ప్రతిష్ఠా ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు సంస్థ ప్రతినిధులు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా స్థానిక ప్రసాదరావుపేటలోని అమూల్య ఆయుర్వేదిక్ కేంద్రంలో తరుణ ప్రజ్ఞా భారతి జయపురం అధ్యక్షులు తరుణ కిరణ్ త్రిపాఠీ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సభ్యులు తీర్మానించారు. తరుణ ప్రజ్ఞా భా రతి ప్రతిష్ఠా దాత స్వర్గీయ డాక్టర్ గంగాధర నందో ఆశయాలకు అనుగుణంగా ఎప్పటిలాగనే సూర్య న మస్కారాలు, యోగాసనాలు, శంఖ నాదం, హులీ హులి, గీతా పఠనం, శ్లోకాల పఠనం, ప్రబంధాలు, వ్యాసరచన, సంస్కృతంలో పరీక్షలు, ముగ్గులు, పిల్లల పాటలు, చిత్ర లేఖనం, దేశభక్తి పాటలు, సంగీతం, ఒడిస్సీ జానపద నృత్యాలు, విలువిద్య మొ దలగు పోటీలను అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థు లు, సాధారణ ప్రజలను, మహిళలు, పురుషులు, పిల్లలు, యువతీ యువకులను మమేకం చేయాల ని నిర్ణయించారు. డిసెంబర్ నేలలో నిర్వహించబడే వార్షికోత్సవంలో వివిధ పోటీలలో విజేతలకు బహుమతులతో సత్కరించాలని నిర్ణయించారు. సమావేశంలో ప్రజ్ఞా భారతి కార్యకర్తలు రామ శంకర షాడంగి, అజయ కుమార్ మల్లిక్, రవీంద్ర మహారాణ, సబిత త్రిపాఠీ, తపస్విణీ సాహు, న్యాయ సలహాదారు న్యాయవాది జి.మహేష్, మొదలగు వారు పాల్గున్నారు.

ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్: కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ ప్రభుత్వ ఆస్పత్రిని కాంగ్రెస్ పార్టీకి చెందిన లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత బుధవారం సందర్శించారు. వివిధ వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. మందుల నిల్వలు, ల్యాబ్‌లో పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి ఉన్నత ఉద్యోగులు, వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆస్పత్రికి అవసరమైన వసతులు, పరికరాలు, మందులు విషయాలు నమెదు చేసుకున్నారు. రోగులకు అందాల్సిన సేవలలో ఎటువంటి రాజీ పడవద్దని సిబ్బందికి సూచించారు. పర్యటనలో డాక్టర్ నబ కిషోర్ పండా, బీపీఎం సంతోషిని పండా, ఎంపీ ప్రతినిధి కై లాస్ చంద్ర ఖోస్లా, మెంటి ఖోరా, పేరెంట్స్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వశక్తీకరణ, పరివర్తన చాంపియన్‌పై శిక్షణ



ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

పర్లాకిమిడి: స్థానిక జిల్లా పరిషత్ పంచాయతీ రిసోర్స్ భవనంలో బుధవారం సర్పంచ్‌లు, నాయిబు సర్పంచ్‌లకు మూడంచెల పంచాయతీరాజ్ విధానంపై పరివర్తన చాంపియన్ శిక్షణ శిబిరాన్ని జిల్లా పరిషత్తు సీడీవో శంకర కెరకెటా ప్రారంభించారు. ఈనెల 25 వరకూ మూడు రోజుల పాటు జరిగే ఈ నారీ స్వశక్తీకరణ పరివర్తన శిక్షణ శిబిరానికి జిల్లా నలుమూలల నుంచి నాయిబు సర్పంచులు, ప్రజా ప్రతినిధులు విచ్చేశారు.

రాష్ట్ర గ్రామీణాభివృద్ధ, పంచాయతీ రాజ్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో జరిగే శిక్షణా శిబిరంలో ఈఆర్‌పీ ట్రైనర్‌గా మలయ మారుతీ దేవి,శ్రేయశ్రీ, సుశీలా మిశ్రా, శుభాంశు శేఖర్ పట్నాయక్ వ్యవహరించారు.



పరివర్తన చాంయన్‌షిప్ శిక్షణ శిబిరానికి హజరైన సర్పంచులు

బీజేపీ యువమోర్చా నేతల నిరసన



బొరిగుమ్మలో ర్యాలీ నిర్వహిస్తున్న యువ మోర్చా శ్రేణులు

జయపురం : నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ఒడిశా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్ నారాయణ ప్రధాన్‌పై కొరాపుట్ జిల్లాలోని బీజేపీ యువ మోర్చా కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదిత్ 19 ఏళ్ల విద్యార్థినిపై అత్యాచారం చేసినట్లు ఆరోపణల నేపథ్యంలో ధర్నా చేపట్టారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు భక్త చరణదాస్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా యువ మోర్చ సాధారణ కార్యదర్శి సరోజ్ కుమార్ పాణిగ్రహి, బొరిగుమ్మ సమితి మూడు మండలాల అధ్యక్షులు బిఘ్నేశ్వర షాడంగి, సుభిమల్ భట్ట, చక్రధర్ గదబ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నదిలో పడి వృద్ధుడి మృతి


సత్యంనాయుడు (ఫైల్)

బలిజిపేట: మండలంలోని పదమాయవలస గ్రామానికి చెందిన టి.సత్యంనాయుడు(82) నదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కొట్టుకుపోయి మృతిచెందాడు. దీనిపై అతని భార్య సరస్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదుమేర ఎస్సై సింహాచలం కేసు నమోదుచేశారు. సత్యంనాయుడు మంగళవారం ఉదయం సువర్ణముఖి నదిలో స్నానానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో కొంత సమయం తరువాత కుటుంబసభ్యులు తీవ్రంగా గాలించారు. ఆయన ఆచూకీ ఎక్కడా కనబడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి బుధవారం సాయంత్రం నారాయణపురం వద్ద పొదల్లో మృతదేహం కనిపించడంతో సత్యంనాయుడుగా గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం ఏరియా హాస్పిటల్‌కు మృతదేహాన్ని తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పాన్‌షాప్ దగ్ధం


కాలిబూడిదైన పాన్‌షాపు

వంగర: మండల పరిధి ఎం.సీతారాంపురం మెయిన్ రోడ్డులో ఉన్న పాన్‌షాప్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో మోణంగి కాంతారావుకు చెందిన షాపు పూర్తిగా కాలిపోయింది. మధ్యాహ్నం సమయంలో షాపు మూసివేసి వ్యాపారి కాంతారావు ఇంటికి భోజనానికి వెళ్లే సమయంలో ఈ ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణహాని జరగలేదు. ఈ ప్రమాదంలో షాపులో ఉన్న నగదు, ఫ్రిజ్, పూర్తి సామగ్రి కాలిబూడిదయ్యాయి. సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లి ఉంటుందని ప్రాథమిక అంచనా వేశారు. ఈ విషయంపై వంగర పోలీసులకు సమాచారం అందించారు.

సారాతో ఇద్దరి అరెస్టు


పాలకొండ: నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా సారా నివారణ చర్యలు చేపట్టామని ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం నిర్వహించిన దాడుల్లో వీరఘట్టం బీసీ కాలనీకి చెందిన గొర్లె రాణి వద్ద 80 లీటర్ల సారా, పనసనందివాడ గ్రామానికి చెందిన బొమ్మాళి డానియల్ దగ్గర 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అరెస్టు చేశామని, నిందితులను కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు చెప్పారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


విశ్వేశ్వరరావు మృతదేహం

రాజాం సిటీ: పట్టణంలోని కుమ్మరవీధికి చెందిన ఓ వ్యక్తి మద్యానికి బానిసై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి మృతుడి తల్లి దమయంతి, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మొండి విశ్వేశ్వరరావు (41) మద్యానికి బానిసయ్యాడు. ఎప్పటిలాగానే ఈ నెల 22న రాత్రి నిద్రించేందుకు మేడపైకి వెళ్లాడు. బుధవారం ఉదయం 10.30గంటల సమయలో భోజనం పట్టుకుని వెళ్లానని, అక్కడ ఫ్యాన్ కొక్కానికి ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడని మృతుడి తల్లి తెలిపింది. వెంటనే స్థానికులకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలపై ఆరా తీశారు. నా చావుకు ఎవరూ కారణం కాదని, పూర్తిగా మద్యానికి బానిసనయ్యానని, మతిస్థిమితం కూడా సరిగా ఉండడం లేదని ఓ డైరీలో నోట్ చేసున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించామని సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని నెల్లిమర్ల వాసి మృతి


మృతుడు సప్పిడి అప్పారావు

తగరపువలస: జాతీయరహదారిపై ఆనందపురం మండలం పెద్దిపాలెం వద్ద మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో రోడ్డు దాటుతున్న సప్పిడి అప్పారావు(40) అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా రాత్రి 11.30 సమయంలో మరణించాడు. మృతుడిది విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండల కేంద్రంలోని రామతీర్థం జంక్షన్. మృతుడి చిన్నాన్న కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు ఎస్సై శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు


గంట్యాడ మండలం పెదవేమలిలో పునాది స్థాయిలో ఉన్న భవనం


నరవలో లింటల్ లెవెల్లో నిలిచిన భవనం


వసంతలో శ్లాబ్ స్థాయిలో భవనం

- జిల్లాలో 2499 కేంద్రాలు
- వాటిలో మినీ కేంద్రాలు 293
- ఏడాదికి అద్దె రూపేణా రూ.6 కోట్ల చెల్లింపు

త్వరగా పూర్తయ్యేలా చర్యలు

అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని ఆదేశాలు ఇచ్చాం. సంబంధిత సీడీపీఓలను కూడా పర్యవేక్షించాలని చెప్పాం. త్వరితగతిన నిర్మాణం పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం.
– టి.విమలారాణి, పీడీ, ఐసీడీఎస్

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రం భవనాల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. భవనాలు మంజూరై ఏళ్ల గడుస్తున్నా వాటి నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల అంగన్‌వాడీలకు సొంత గూడు కరువవుతోంది. దీంతో అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాల్సిన పరిస్థితి. వివిధ పథకాల కింద జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరైనప్పటికీ వాటి నిర్మాణం పూర్తి చేయడంలో అలసత్వం కారణంగా అంగన్‌వాడీలకు తిప్పలు తప్పడం లేదు. వసతులు లేక, ఇరుకు గదుల్లోనే కేంద్రాలను నిర్వహించాల్సిన దుస్థితి. దీనివల్ల కేంద్రాల్లో చదివే పిల్లలు అవస్థలు పడుతున్నారు.

జిల్లాలో 2499 కేంద్రాలు

జిల్లాలో 2499 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 2206 మెయిన్ కేంద్రాలు , 293 మినీ కేంద్రాలు. వాటిలో సొంత భవనాల్లో నడుస్తున్న కేంద్రాలు 792 ఉన్నాయి. అద్దె రహిత భవనాల్లో 494 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అద్దె భవనాల్లో 1213 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అద్దె కేంద్రాలు కూడా ఇరుకుగా ఉండడంతో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందడం లేదు.

ఏడాదికి రూ.6 కోట్ల అద్దె చెల్లింపు

జిల్లాలోని అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు ఏడాదికి కోట్లాది రుపాయలు అద్దె చెల్లిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె రూ.2 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 6 వేల వరకు చెల్లిస్తున్నారు ఏడాదికి వాటికి సుమారు రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు అవుతోంది. సొంత భవనాలు మంజూరైనప్పటికీ అద్దె చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

వివిధ పథకాల కింద 919 కేంద్రాలకు భవనాలు

జిల్లాలో వివిధ పథకాల కింద 919 అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరయ్యాయి. వాటిలో 364 భవనాల నిర్మాణం పూర్తయింది. 262 భవనాలకు ఇంకా పునాది రాయి పడలేదు. 288 భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఉపాధి హామీపథకం -1, 2 కింద భవనాల నిర్మాణానికి ఒక్కో దానికి రూ.7.50 లక్షలు, ఆర్‌డీఎఫ్ కింద ఒక్కో భవనానికి రూ.12 లక్షలు, ఆర్‌ఐడీఎఫ్-23 పథకం కింద ఒక్కో భవనానికి రూ.11.20 లక్షలు, ఆర్‌ఐడీఎఫ్-24 కింద ఒక్కో భవనానికి రూ.12 లక్షలు ఎంబీఎంబీ పథకం కింద ఒక్కో భవనానికి రూ. 16 లక్షలు చొప్పున మంజూరయ్యాయి.

పెంచిన సినిమా టికెట్ ధరలు తగ్గించాలి

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న



విజయనగరం గంటస్తంభం: రాష్ట్ర ప్రభుత్వం హర హర వీరమల్లు సినిమా కోసం టికెట్ ధరలు పెంచుతూ తీసుకున్న ఉత్తర్వులు తక్షణమే రద్దు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సామాన్యులకు అన్నింటా అధిక ధరల పెంపుతో చుక్కలు చూపిస్తున్న ప్రభుత్వం చివరికి వినోదం కోసం సినిమా వీక్షించేందుకు థియేటర్లకు వెళ్లినా వదలడం లేదన్నారు. సినిమా విడుదలకు ఒక రోజు ముందు బెనిఫిట్ షో పేరుతో రూ.700 నుంచి రూ.1000 వరకు వసూలు చేయడం దారుణమన్నారు. బెనిఫిట్ షో పేరుతో ప్రేక్షకులను దోపిడీ చేసే విధానాన్ని అదుపు చేయాలని డిమాండ్ చేశారు.

24న ప్రభుత్వ ఐటీఐలో రెండవ విడత కౌన్సెలింగ్

విజయనగరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో రెండవ విడత ప్రవేశ కౌన్సెలింగ్ ఈ నెల 24న నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ టీవీ గిరి తెలిపారు. మొదటి దశలో మిగిలిన సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేసుకున్న అభ్యర్థులకు మెరిట్ జాబితా ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు తమ పదవ తరగతి జీపీఏ మార్కుల ఆధారంగా కేటాయించిన ర్యాంకుల ప్రకారం ఆ రోజు ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. మొదటి దశ కౌన్సెలింగ్‌లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్‌లలో సీట్లు పూర్తిగా భర్తీ అయినట్లు తెలిపారు.


28న ఉచిత శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఈ నెల 28న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ ఎం.రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ స్త్రీ, పురుషులు అర్హులన్నారు. పురుషులకు కంప్యూటర్ డీటీపీ (45 రోజులు), సెల్‌ఫోన్ రిపేరింగ్ అండ్ సర్వీసింగ్ (30 రోజులు), జెంట్స్ టైలరింగ్ (31 రోజులు), కారు డ్రైవింగ్ (ఎల్‌ఎల్‌ఆర్ కలిగి ఉండాలి) (30 రోజులు), అలాగే స్త్రీలకు లేడీస్ టైలరింగ్ (31 రోజులు), బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ (35 రోజులు), మగ్గం వర్క్స్ అండ్ శారీపెయింటింగ్ వర్క్స్ (31 రోజులు), పుట్టగొడుగుల తయారీ (10 రోజులు), జూట్ బ్యాగుల తయారీ (14 రోజులు), హోమ్ నర్సింగ్ (25 రోజులు)లో శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్ కార్డులతో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9014716255, 9491741129, 9866913371, 9989953145 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

పోస్టల్ రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం

సీతంపేట: పోస్టల్ శాఖ రిజిస్ట్రేషన్ సేవలకు గత ఐదు రోజులుగా అంతరాయం ఏర్పడడంతో పలు కార్యాలయాలు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాలకు రిజిస్టర్డ్ పోస్టులో ఉత్తర ప్రత్యుత్తరాలు పంపించాలన్నా సమస్యలు ఏర్పడుతున్నాయని పలువురు తెలిపారు. దీంతో ప్రైవేటు డెలివరీ సంస్థలను ఆశ్రయిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ సమస్యలతో గత కొద్ది రోజులుగా రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం ఏర్పడిందని త్వరలోనే పునరుద్ధరణ జరుగుతుందని సంబంధిత పోస్టల్ సిబ్బంది తెలిపారు.

మడ్డువలసకు 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద బుధవారం 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు వద్ద 64.50 మీటర్లు లెవెల్ నీటిమట్టం నమోదైంది. కుడి ప్రధాన కాలువ ద్వారా 700 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 10 క్యూసెక్కుల నీరు పంట పొలాలకు తరలిస్తున్నారు. ప్రాజెక్టు నుంచి ఔట్‌ఫ్లో లేదని ఏఈ నితిన్ తెలిపారు.

పిడుగుపాటుతో రైతు మృతి


రేగిడి: శ్రీను మృతదేహం


ఆవు కళేబరం

రేగిడి: రేగిడి మండల పరిధిలోని జాడపేట గ్రామంలో బుధవారం పిడుగుపాటుకు గురై గ్రామానికి చెందిన రైతు అల్లబోయిన శ్రీను (50) మృతిచెందాడు. తన పొలంలో తోటి రైతులతో కలిసి నారు తీస్తున్న సమయంలో ఆయన భార్య నీలవేణి పనులు చేస్తున్న రైతులకు భోజనాలు తీసుకువెళ్లింది. నారు తీసిన అల్లబోయిన శ్రీనుతోపాటు మిగిలిన రైతులు భోజనాలు చేసుకునేందుకు చేతులు శుభ్రం చేసుకుంటున్న సమయంలోనే పిడుగు పడింది. దీంతో సంఘటనా స్థలంలోనే శ్రీను మృతిచెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. పక్కనే ఉన్న రైతులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వెంటనే పరిసరాల్లోని రైతులు ఘటనా స్థలానికి వచ్చి అస్వస్థతకు గురైనవారికి సపర్యలు చేశారు. మృతదేహాన్ని రాజాం సామాజిక ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పి.నీలావతి విలేకరులకు తెలిపారు.

మరో గ్రామంలో ఆవు..

గుర్ల: మండలంలోని కోటగండ్రేడులో బుధవారం సాయంత్రం కురిసిన చిరు జల్లులతో పాటు పాటు పిడుగులు పడడంతో అదే గ్రామానికి చెందిన ముద్దాడ అప్పలనాయుడి ఆవు మృతి చెందింది. పశువుల శాల పక్కన చెట్టు వద్ద ఉన్న ఆవుపై పిడుగు పడి మృతి చెందడంతో రైతు కన్నీరుమున్నీరవుతున్నాడు.

30 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్ట్


పోలీసులకు పట్టుబడిన గంజాయి నిందితులు

విజయనగరం క్రైమ్: విజయనగరం రైల్వేస్టేషన్ రోడ్డులోని ఎంఆర్ లాడ్జి ఎదురుగా ముగ్గురు వ్యక్తులు 30 కిలోల గంజాయితో పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు వన్ టౌన్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 22న వన్ టౌన్ పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారంతో రైల్వేస్టేషన్ రోడ్డులో మాటు వేసి ఉండగా, ముగ్గురు వ్యక్తులు రెండు ట్రాలీ సూట్ కేసులను తోసుకుంటూ ఎంఆర్ లాడ్జి ఎదురుగా వచ్చేసరికి, అనుమానంతో వన్ టౌన్ పోలీసులు సోదా చేశారన్నారు. ఒక ట్రాలీ సూట్ కేసులో 13కిలోలు, మరో సూట్ కేసులో 17కిలోల గంజాయి, నాలుగు ఆండ్రాయిడ్ ఫోన్లు, రెండు కీ ప్యాడ్ ఫోన్లు, రూ.4000 నగదు లభించినట్లు చెప్పారు. పట్టుబడిన నిందితులను (ఎ1) ఒడిశాలోని కలహండి జిల్లా ఉచ్చలకు చెందిన పితాంబర్ నాగ్ (42) (ఎ2) కలహండి జిల్లా బిరుమలకు చెందిన చంద్ర కరుణ్ (35) (ఎ3) చార్‌బహల్‌కు చెందిన ప్రదీప్ నాయక్ (40)లుగా గుర్తించామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నామని తెలిపారు.

పోగొట్టుకున్న బ్యాగ్ లభ్యం

- బాధితురాలికి అందజేసిన పోలీసులు


గురుగుబిల్లికి చెందిన బాధితురాలికి బ్యాగ్ అప్పగిస్తున్న వన్ టౌన్ సీఐ చౌదరి, ఎస్సై సురేంద్ర నాయుడు

విజయనగరం క్రైమ్: పార్వతీపురం మన్యం జిల్లా నుంచి విజయనగరం వచ్చిన ఓ మహిళ తన బ్యాగ్ పోయిందని వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనతికాలంలోనే ట్రేస్ చేసి ఆ బ్యాగ్‌ను బాధితురాలికి పోలీసులు అప్పగించారు. ఈ ఘటనపై వన్ టౌన్ సీఐ చౌదరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం రావుపల్లికి చెందిన పల్లెం లక్ష్మి తన కుమార్తెను చూసేందుకు బుధవారం విజయనగరం వచ్చి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో ఎక్కి, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద దిగిపోయింది. తరువాత ఆటోలో బ్యాగు మర్చిపోయినట్లు గుర్తించి, వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు వన్ టౌన్ సీఐ ఆర్వీఆర్కే చౌదరి ఆదేశాలతో టౌన్ క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు, సిబ్బంది ఆటోను ట్రేస్ చేసి ఆటోలో లభించిన బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ బ్యాగులో ఉన్న రెండు న్నర తులాల నల్ల పూసల తాడు, రూ.1300 నగదుతో బాధితురాలు లక్ష్మికి సీఐ అప్పగించారు.

ఆదర్శ పాఠశాలలో పురుగుల బియ్యం మార్పు


మంచి బియ్యాన్ని వ్యాన్ నుంచి పాఠశాలకు చేరవేస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్...

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి ఆదర్శ పాఠశాలకు వచ్చిన పురుగుల బియ్యంపై బుధవారం సాక్షిలో వచ్చిన కథనంపై పౌర సరఫరాల శాఖ అధికారులు స్పందించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శాంతి ఆదేశాల మేరకు పౌర సరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ మహేష్ వచ్చి బియ్యాన్ని పరిశీలించి పురుగులు ఉన్నట్లు నిర్ధారించారు. వెంటనే బియ్యాన్ని వ్యాన్‌లోకి ఎక్కించి కొత్తగా 25 కేజీల బియ్యం ప్యాకెట్లను 32 బస్తాలను ప్రిన్స్‌పాల్ ఈశ్వరావుకు అందజేశారు. ఇలాంటి పొరపాట్లు ఇంకెక్కడా జరగకుండా ముందు జాగ్రత్తలు పాటించనున్నట్లు ఆయన సాక్షితో అన్నారు.పత్రికలో వచ్చిన కథనంతో పురుగుల బియ్యం మార్చి మంచి బియ్యం పాఠశాలకు అందజేయడంతో విద్యార్థులు, తల్లి తండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మా భూములు మాకివ్వండి

- జిందాల్ నిర్వాసిత రైతుల డిమాండ్


డిప్యూటీ కలెక్టర్ మురళికి వినతిపత్రం ఇస్తున్న నిర్వాసిత రైతులు

శృంగవరపుకోట: జిందాల్ కర్మాగారం అన్యాయం చేసిన రైతులను ఆదుకోవాలని కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ ఇ.మురళిని జిందాల్ నిర్వాసిత రైతులు కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వాసితుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఆయన బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. దీంతో జిందాల్ నిర్వాసితులు ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ నేతృత్వంలో డిప్యూటీ కలెక్టర్ మురళిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు కంపెనీ ఏర్పాటు చేస్తాం. ఉద్యోగాలిస్తాం. ఉపాధి కల్పిస్తాం. పరిహారం ఇస్తాం. షేర్లు ఇస్తాం. కంపెనీలో వాటాలు ఇస్తామని నమ్మబలికి భూములు కాజేశారన్నారు. 18యేళ్లయినా కంపెనీ ఏర్పాటు చేయనందున మా భూములు మాకు ఇవ్వండని డిమాండ్ చేశారు. అడ్డగోలుగా మిషన్లు తెచ్చి, చెట్లు కూల్చేసి, పంటలు తీసేసి దౌర్జన్యంతో ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు జిందాల్‌కు కాపలా కాస్తూ, మాపై కేసులు పెడుతున్నారని వాపోయారు. మా భూములు మాకు ఇచ్చి న్యాయం చేయండి అంటూ డిప్యూటీ కలెక్టర్ మురళికి వినతిపత్రం అందజేశారు.

తిరుపతిలో విజయనగరం కళాకారుల ఖ్యాతి



కళాకారులను సత్కరిస్తున్న అభినయ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: అభినయ ఆర్ట్స్ అసోసియేషన్ తిరుపతిలో నిర్వహించిన 25వ వార్షిక జాతీయ పద్యనాటకంలో విజయనగరం జిల్లాకు చెందిన శ్రీ శ్యామలాంబ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ అద్భుతమైన ప్రతిభను కనబరిచింది. సత్యానందం నిర్వహణలో ఈపు విజయకుమార్ దర్శకత్వంలో 25 మంది నటీనటులు ఆదికవి నన్నయభట్టు పద్యనాటకాన్ని మహతి ఆడిటోరియంలో ప్రదర్శించి ఆహూతుల మన్ననలు పొందారు. నన్నయ్యగా కె.సూర్యనారాయణ, నారాయణ భట్టుగా సుబ్రహ్మణ్యం, సోమిదమ్మగా పద్మ, రాజరాజనరేంద్రుడిగా సత్యం మాస్టారు, డిండిమభట్టుగా నల్ల శివరాంనాయుడు, దుర్యోధనుడిగా తిరుపతినాయుడు, శకునిగా లింగరాజు, విదురుడుగా రమణారావు, దృతరాష్ట్రుడిగా కృష్ణ గణేష్, సేనాధిపతిగా ఆర్.సూర్యపాత్రో, సామంత రాజుగా ఎల్. వెంకటేశ్వర్లు, వార్తాహరుడిగా పైడినాయుడు, వేద వ్యాసుడిగా వీవీఎస్.ఎస్. గుప్త, భటుడిగా కోండ్రు కృష్ణారావు, సంగీతం త్రినాథ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు టీమ్‌ను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లాకు చెందిన కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రాక్టికల్ శిక్షణకు పదిమంది ఎస్సైలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి


సమావేశంలో పాల్గొన్న ప్రొబేషనరీ సివిల్ ఎస్సైలు

పార్వతీపురం రూరల్: ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరీ సివిల్ ఎస్సైలను ప్రాక్టికల్ శిక్షణ నిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లాకు పది మందిని కేటాయించినట్లు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న 49 మంది ఎస్సైలు ఐదు నెలల ప్రాక్టికల్ శిక్షణకు వెళ్లేముందు బుధవారం విశాఖలో డీఐజీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఐజీ వారితో మాట్లాడుతూ పోలీస్ విభాగంలో విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీ, సేవా తత్పరత అత్యంత ముఖ్యమని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం సాధన, పోలీసులు ఎదుర్కొనే సవాళ్లను అధిగమించడానికి ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో విధులు, రికార్డులు, స్థానిక చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సహచర ఉద్యోగులు, ప్రజలతో విశ్వాసపూర్వక సంబంధాలు ఏర్పరిచినప్పుడు సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడితో పాటు ఏఎస్ఆర్, విజయనగరం జిల్లాల ఎస్పీలు మరికొందరు అధికారులు, ప్రొబేషనరీ ఎస్సైలు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల వేతన యాతన


తీవ్ర ఆవేదనలో ఉన్న వీఆర్‌ఏలు

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా తమ వేతనాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని వీఆర్‌ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సమాన పనికి సమాన వేతనం అమలు చేయాల్సి ఉన్నా ఇప్పటి దాకా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రెవెన్యూ శాఖ ద్వారా రాష్ట్రం లేదా కేంద్ర ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా గ్రామస్థాయిలో అది విజయవంతం కావాలంటే దానికి విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్(వీఆర్‌ఏ)లే కీలకంగా ఉంటారు. కలెక్టర్ నుంచి గ్రామ స్థాయి వీఆర్వో వరకు ఏ పని జరగాలన్నా దానికి కావాల్సింది వీఆర్‌ఏలే. రాత్రీపగలు తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు డ్యూటీలు వేస్తే మారు మాట్లాడకుండా ఎంత దూరాభారమైనా వెళ్లి రావాల్సిందే తప్ప..ఇదేంటి అని అడిగే అధికారం ఉండదని వీఆర్‌ఏలు అంటున్నారు. టైం జాబ్‌గా ప్రారంభమై ఇప్పుడు సమయమే లేని ఉద్యోగంగా తయారైంది. ఎప్పుడు పిలిచినా రావాలి. ఏం చెప్పినా చేయాలనే చందాన అధికారులు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. రోజుకు రూ.370 భత్యంతో నెలకు రూ.10,000 నుంచి రూ.11,085 జీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు.పేస్కేల్ అమలు చేసి ప్రతి నెలా రూ.18,000 జీతం ఇవ్వాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

సిబ్బంది తక్కువ పని ఎక్కువ..

పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో వీఆర్‌ఏల కొరత తీవ్రంగా ఉంది. మండలానికి కనీసం 45 మంది వీఆర్‌ఏలు ఉండాల్సి ఉండగా కేవలం 20 నుంచి 35 మంది మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 415 మంది వీఆర్‌ఏలు ఉండగా సుమారు 100 రెవెన్యూ గ్రామాల్లో వీఆర్‌ఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా రీ-సర్వే, రేషన్ కార్డుల సర్వే, రెవెన్యూ కార్యక్రమాలు ఇతర ఏరకమైన పనులు ఉన్నా వారితోనే చేయించడంతో తీవ్ర పని ఒత్తిడికి లోనవుతున్నారు. తమ పని తాము చేసుకోవడమే చాలా కష్టంగా ఉందని ఇప్పుడు రీ-సర్వే పేరుతో ఇతర గ్రామాలకు కూడా పంపించి పని చేయిస్తున్నారని దానివల్ల మాకు కనీస ప్రతిఫలం లేదని వాపోతున్నారు.

మంత్రి లోకేష్‌కు వినతి పత్రం ఇచ్చినా..

అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు వీఆర్‌ఏలకు న్యాయం చేస్తామని ఆనాటి కూటమి నాయకుల వాగ్దానాలు నమ్మి మోసపోయామని వీఆర్‌ఏలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీతాలు పెంచాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీఆర్‌ఏల సంఘం నాయకులు మంత్రి నారా లోకేష్‌ను ఒకసారి కలిసి తమ సమస్యలు విన్నవించినప్పటికీ ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని మండిపడుతున్నారు.

ప్రమోషన్‌లు ఇవ్వాలి

కూటమి ప్రభుత్వంలో మాకు తగిన గుర్తింపు ఇవ్వాలి. వీఆర్‌ఏలుగా ఎన్నో ఏళ్ల సీనియారిటీ కలిగిన వారిని గుర్తించి ప్రభుత్వం పదోన్నతులు కల్పించాలి. డీఏలు ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలి. చాలీచాలని జీతంతో కుటుంబం గడవాలంటే కష్టంగా ఉంది. ఇప్పటికైనా మా జీతాలు పెంచాలి.
– జి.జగన్, వీఆర్‌ఏ, కంబర